## క్లుప్తంగా

### ఘనంగా ఏరువాక పున్నమి


అలంకరించిన వృషభాలతో చిన్నారులు

**కల్లూరు:** మండలంలో ఏరువాక పున్నమి (పౌర్ణమి) వేడుకలను రైతులు ఘనంగా జరుపుకున్నారు. రైతన్నలు తమ ఎద్దులను ప్రత్యేకంగా రంగులతో అలంకరించారు. ఈ ఏడాది నైరుతి రుతు పవనాల ప్రభావంతో సకాలంలో వర్షాలు కురుస్తుండంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు తమ పొలాలను సిద్ధం చేసి విత్తనం విత్తే పనుల్లో బిజీగా ఉన్నారు.

**సి.బెళగల్:** మండలంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ పౌర్ణమిరోజున రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతారు. వ్యవసాయ పరికరాలు, వృషభాలను అందంగా అంకరించి గ్రామాలలో మేళతాలాలతో ఊరేగించడం ఆనవాయితీ. ఈ మేరకు రైతులు ఎద్దులను ముస్తాబు చేశారు.

### సుంకేసులకు కొనసాగుతున్న నీటి విడుదల

**గూడూరు రూరల్:** సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. శుక్రవారం రిజర్వాయర్‌కు 620 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా దిగువకు 449 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కులను అధికారులు విడుదల చేశారు. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 1.200 టీఎంసీ కాగా ప్రస్తుతం 1.152 టీఎంసీ నిల్వ ఉంది.

### 60 రోజుల వరకు పత్తికి పురుగు మందుల పిచికారీ వద్దు




రైతులతో కలిసి పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

**కోడుమూరు రూరల్:** పత్తి పంట సాగు చేసిన రైతులు 60రోజుల వరకు ఎలాంటి పురుగు మందులను పిచికారీ చేయరాదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరులో సాగు చేసిన పంట పొలాలను ఏఓ పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ పత్తి సాగు చేసిన రైతులు అప్పుడే పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్నారని, దీంతో ప్రయోజనం ఉందన్నారు. 60రోజుల వరకు పత్తికి ఎలాంటి పురుగుమందులను కొట్టరాదని, ఏవైనా తెగుళ్లు ఉంటే వ్యవసాయాధికారి సలహాలు తీసుకుని మందులను వినియోగించాలని సూచించారు.

### ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

**గూడూరు రూరల్:** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈఓ సునీలమ్మ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని జ్యోతి స్కూల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టిక, పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. విద్యా హక్కు చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. ఫస్ట్ క్లాస్‌కు 25 శాతం సీట్లను ఉచితంగా అందించాలని ప్రభుత్వ నిబంధన ఉందని, ఎంత మేరకు ఆన్‌లైన్‌లో విఆద్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



బోల్తా పడిన ట్రాలీ ఆటో, గాయపడిన చెన్నయ్య

**పాణ్యం:** మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం సుగాలిమెట్ట వద్ద ఉన్న యూటర్న్ వద్ద ముందు వెళ్తున్న ట్రాలీ ఆటోను వెనుక వస్తున్న టిప్పర్ అధిగమించబోయింది. ఈ క్రమంలో టిప్పర్ ట్రాలీ ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చెన్నయ్యకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన చెన్నయ్యను నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అలాగే పోలీసులు రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టారు.

### స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు

**కర్నూలు (టౌన్) :** మార్షల్ ఆర్ట్స్‌లో భాగమే స్కై మార్షల్ ఆర్ట్స్ అని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక కోల్స్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ స్కై మార్షల్‌ఆర్ట్స్ క్రీడకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు ఉందన్నారు. ఒలింపిక్ డేను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతలకు ఒలింపిక్ డే రోజు పతకాలు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నబీ సాహెబ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలసి యోగా చేస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి


నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు


విద్యార్థులకు యోగా నేర్పుతున్న అధ్యాపకుడు చంద్రశేఖర్


అమడగుంట్ల హైస్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


గడివేముల హైస్కూల్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు


పాణ్యం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థుల యోగా ప్రదర్శన


**సి.బెళగల్:** మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఓ జ్యోతి పర్యవేక్షణలో పీఈటీ మాదవలక్ష్మమ్మ విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. ప్రాణాయామం,వృక్షాసనం, వజ్రాసనం వంటి యోగాసనాలు ప్రదర్శించారు. విద్యార్థినుల యోగసనాలు చూపరులను అబ్బురపరిచాయి.

**కల్లూరు:** యోగా చేయడం వల్ల మానసిక వికాసం మెరుగవుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉలిందకొండ చెరువు కట్ట వద్ద పాఠశాల విద్యార్థులతో కలసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ యోగాసనాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దరి చేరవన్నారు. బీపీ, మధుమేహం, మానసిక సమస్యలైన ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, నిద్రలేమి మొదలగు సమస్యలను దూరం చేస్తుందన్నారు. సర్పంచ్ మాసెపోగు సుంకులమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ మద్దేశ్వరమ్మ, మండల స్థాయి అధికారులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడులో నిర్వహించిన యోగా కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థులతో కలసి యోగాసనాలు వేశారు. విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం యోగా దినోత్సవం నిర్వహించారు. కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యానికి కాపాడుకోవాలంటే యోగాకు మించిన మార్గం లేదన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.
- చిన్నటేకూరు సమీపంలోని క్రియేటివ్ ఎడ్యుకేషన్ సొసైటీస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ కె. మునిస్వామి హాజరై యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. ప్రిన్సిపల్ రవిప్రకాశ్, ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం ప్రాణేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యోగా అనే పదం సంస్కృతం నుంచి ఉద్భవించిందని, అలాగే శరీరం, స్పృహ కలయికకు ప్రతీకగా నిలిచిందన్నారు. యోగా ప్రాముఖ్యతను గుర్తించిన ఐక్యరాజ్య సమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా 2014 డిసెంబర్ 11న తీర్మానం చేసిందని వివరించారు. యోగా అనేది మనస్సు, శరీరం, ఆలోచన చర్యల ఐక్యతను కలిగి ఉంటుందని నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో–ఆర్డినేటర్ మద్దిలేటి అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాణ్యం:** మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, డాక్టర్లు, సిబ్బంది యోగా చేశారు. పాణ్యం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, ఏపీఎం విజయరాణి, పాణ్యం ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి, హెచ్ఎం మేరీ సులోచనతో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. నిరంతరం యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. అలాగే కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు.

- యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని శాంతిరామ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు యోగా అలవాటు చేసుకోవాలన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**గడివేముల:** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్కూల్ పీడీ భుజంగరావు ఆధ్వర్యంలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులలో చైతన్యం తెచ్చేందుకు పలు రకాల ఆసనాలను నేర్పించారు.

**సి.బెళగల్:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సి.బెళగల్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) ఎంపీడీఓ శకుంతల, కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈఓఆర్డీ సందీప్ ఉపాధ్యాయులతో కలిసి యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ, ఈఓఆర్డీ, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. అదేవిధంగా మండల మహిళా మండలి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి భవన్‌లో వైకేపీ ఏపీఎం వెంకటస్వామి నిర్వహించిన యోగాడేలో పాల్గొన్న ఎంపీడీఓ శకుంతల యోగా ప్రముఖ్యతను వివరించారు. ఏఎన్ఎం పుష్పలత మహిళలతో యోగాసనాలు వేయించారు.

**ఆకట్టుకున్న కేజీబీవీ విద్యార్థినుల యోగాసనాలు**

**సి.బెళగల్:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సి.బెళగల్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) ఎంపీడీఓ శకుంతల, కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈఓఆర్డీ సందీప్ ఉపాధ్యాయులతో కలిసి యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ, ఈఓఆర్డీ, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. అదేవిధంగా మండల మహిళా మండలి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి భవన్‌లో వైకేపీ ఏపీఎం వెంకటస్వామి నిర్వహించిన యోగాడేలో పాల్గొన్న ఎంపీడీఓ శకుంతల యోగా ప్రముఖ్యతను వివరించారు. ఏఎన్ఎం పుష్పలత మహిళలతో యోగాసనాలు వేయించారు.

**యోగాతో చక్కటి ఆరోగ్యం**

**కోడుమూరు రూరల్:** ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మనిషికి చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ హోమియో మండల వైద్యాధికారిణి డా.హుశేన్‌బీబీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పులకుర్తి హైస్కూల్లో హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డా.హుశేన్‌బీబీ మాట్లాడుతూ మనిషి నిత్యం ఎన్నో ఆలోచనలు, ఒత్తిళ్లతో సతమతమవుతుంటారని, యోగా ద్వారా వాటన్నింటి నుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. యోగా ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెంపొందుతుందని చెప్పారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ హెచ్ఎంలు విద్యార్థులతో యోగాసానాలు వేయించి యోగా గొప్పతనాన్ని వివరించారు.

**గూడూరు రూరల్:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ సమక్షంలో అధ్యాపకులు చంద్రశేఖర్, కోటేశ్వరి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా, ధ్యానం ప్రయోజనాలను వారు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుంకన్న, మాధవీలత, ప్రసన్నకుమారి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.


పాణ్యం ప్రభుత్వ పాఠశాలలో యోగా చేస్తున్న మండలస్థాయి అధికారులు


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

## రైతులు సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి


సొసైటీ ఆవరణలో మొక్కను నాటుతున్న దృశ్యం

**ఓర్వకల్లు:** మండలంలోని నన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులు తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని సొసైటీ సీఈఓ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సొసైటీ నందు సభ్యత్వం కలిగి, రుణాలు తీసుకున్న రైతులు తమ ఓటు హక్కును రెన్యూవల్ చేసుకోవాలన్నారు. అందుకు ఆధార్/పాన్ కార్డు, పొలం పాసుపుస్తకంతో పాటు, రెండు ఫొటోలను ఈ నెల 29వ తేదీలోగా అందజేయాలని సూచించారు. గడువులోగా వివరాలను అందజేయని రైతుల సభ్యత్వాన్ని రద్దు చేయడం జరుగుతుందన్నారు. అంతేగాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ పథకాలు వర్తించాలంటే రైతుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. అనంతరం సొసైటీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కృష్ణానగర్ బ్రాంచి చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వారు ప్రవేశపెట్టిన 'మాన్‌సూన్ డిపాజిట్' పథకంలో సంఘ రైతులు, వినియోగదారులు డిపాజిట్లు చేసి అధిక లాభం పొందవచ్చని వివరించారు. సంఘం సీఈఓ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలను బడిలో చేర్పించాలి


గనిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**గడివేముల:** బడి ఈడు పిల్లలంతా స్కూళ్లలోనే ఉండాలనే ఉద్దేశంతో విద్యాశాఖ 'నేను బడికి పోతా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంఈఓ మేరీ సునీత తెలిపారు. శుక్రవారం గడివేముల స్పెషల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి పాత బస్టాండు వరకు విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీ నుంచి నెలరోజుల పాటు సాగే ఈ స్పెషల్ డ్రైవ్‌లో సచివాలయ ఉద్యోగులతో పాటు విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నందున, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 విమలా వసుంధరదేవి, మహిళా పోలీసు అమల, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగివుండాలి


ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మేనేజర్లు లక్ష్మినారాయణ, సుదర్శన్‌రెడ్డి

**కోడుమూరు రూరల్ :** బ్యాంకు లావాదేవీలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని కోడుమూరు ఎస్‌బీఐ, ఏపీజీబీ మేనేజర్లు లక్ష్మినారాయణ, సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కోడుమూరులోని మోడల్ స్కూల్ విద్యార్థులకు డీఈఏ, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంకుల మేనేజర్లు బ్యాకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్లు మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు ఎంతో ప్రధానమైనవని, క్రెడిట్, ఏటీఎం కార్డుల పిన్ నంబర్లను ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు చెప్పరాదన్నారు. అలాగే చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, అధ్యాపకులు, రీసోర్స్ పర్సన్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కర్నూలు (అగ్రికల్చర్):** విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్ పనులు శనివారం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. మారుతీ మెగా సిటీ, బద్రీనాథ్ నగర్, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీ నగర్, నంద్యాల చెక్‌పోస్టు, శరీన్‌నగర్, అబ్బాస్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రానగర్, ఉద్యోగ నగర్, సాయినాథ్ నగర్, శ్రీరాం నగర్, శారదా నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# శిథిలావస్థకు చేరిన వంతెన

- మోత బరువుతో కుందూ వంతెనకు పొంచి ఉన్న ముప్పు
- ఇప్పటికే పాక్షికంగా శిథిలమైన రక్షణ గోడలు
- జీవితకాలం ముగుస్తున్నా మరమ్మతులకు నోచుకోని దీనావస్థ
- నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రహదారిపై బూజునూరు గ్రామం బ్రిడ్జి పరిస్థితి
- కొత్త బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్న వాహనదారులు


బూజునూరు గ్రామం వద్ద కుందూనదిపై శిథిలావస్థకు చేరిన వంతెన

**గడివేముల:** ఒకప్పుడు మండలంలోనే పెద్ద వంతెనగా పేరు. వందల క్యూసెక్కుల వరద నీటి ఉధృతిని తట్టుకుని నిలబడి నాటి ఇంజినీరింగ్ నైపుణ్యానికి మచ్చు తునకగా నిలిచిన నిర్మాణం. ఇదంతా గతం. సామర్థ్యానికి మించి భారం, మరమ్మతులకు నోచుకోని దుర్భర పరిస్థితులతో నేడు ఆ సేతువు భద్రత గాల్లో దీపంలా మారింది.

**పది టన్నుల సామర్థ్యం.. 50 టన్నుల మోత**

మండల పరిధిలోని బూజునూరు వద్ద కుందూ నదిపై ఆరు దశాబ్దాల క్రితం బ్రిడ్జి నిర్మించారు. 60 ఏళ్ల కిందట పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో బ్రిడ్జిని నిర్మించినట్లు తెలిసింది. నాటి అవసరాల ప్రకారం గరిష్టంగా 10 టన్నుల సామర్థ్యాన్ని మించి నిర్మించే అవకాశం లేదని నిపుణుల అభిప్రాయం. దీన్ని ఆర్‌సీసీ(రీఇన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్) పద్ధతిలో కట్టి జిల్లా పరిషత్ నుంచి రహదారులు భవనాల శాఖకు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు. దీని జీవిత కాలం 50 నుంచి 70 సంవత్సరాల వరకు ఉండొచ్చని, అదీ సరైన మరమ్మతులు నిర్వహించినపుడు మాత్రమే సాధ్యమని తెలుస్తోంది.

**మరమ్మతులు శూన్యం**

నాటి కొద్దిపాటి రాకపోకలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ బ్రిడ్జికి గత కొన్ని ఏళ్ల నుంచి గడ్డు కాలం దాపురించింది. సమీపంలోని జిందాల్ సిమెంట్ పరిశ్రమకు బళ్లారి, తెలంగాణ నుంచి స్లాగ్ లాటరైట్, కార్బన్ పౌడర్ తదితర ముడి పదార్థాల్ని తరలించే భారీ లారీలు వంతెనను కుంగదీస్తున్నాయి. రమారమి 50 టన్నుల బరువుతో వెళ్లే వాహనాల వల్ల విపరీతమైన ఒత్తిడికి గురవుతోంది. అడుగుభాగాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అవగతమౌతుంది. 30 శాతం పైనే రక్షణ గోడలు శిథిలమయ్యాయి. ఎప్పుడో 2015–16లో రూ.10 లక్షలతో మరమ్మతుల ప్రతిపాదనలు పంపగా అవి నేటికీ ఆచరణకు నోచుకున్న పాపాన పోలేదు. రాష్ట్ర రహదారి–48పై ఉన్న ఈ వంతెనపై తరచుగా శాఖాధికారులు తిరుగుతున్నా కనీసం, పరిమితి గురించి సూచిక బోర్డులూ ఏర్పాటు చేయకపోవడం విచారకరమని వాహనదారులు చర్చించుకుంటున్నారు.

**కొత్త బ్రిడ్జి నిర్మించాలి**


మా గ్రామం సమీపంలో నంద్యాల రహదారిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి కింద పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో పాటు రక్షణ గోడలు కూలిపోయాయి. అధిక లోడుతో వాహనాలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. దెబ్బతిన్న బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మించాలి.
– పైపాలెం ఉశేన్, గడివేముల

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సెబ్ సీఐ రామాంజినేయులు

**కోడుమూరు రూరల్ :** మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోడుమూరు సెబ్ సీఐ రామాంజినేయులు సూచించారు. శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగం– చట్టపరమైన చర్యలు, సాంఘిక,ఆర్థిక పరస్థితులపై కోడుమూరులోని కస్తూర్బా, బాలికల హైస్కూల్, వివేకానంద డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెబ్ సీఐ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో యువత చెడుదారి పట్టడంతో పాటు, విలువైన జీవితాన్ని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.